అస్తవ్యస్తమైన మంటల నడుమ ఆ ఆకారం భయంకరంగా ఉంది. వికటాట్టహాసం చేస్తూ, పెద్ద అంగలు వేస్తూ మీది మీదికి వస్తూంది. ప్రతి కదలికతో గగుర్పాటు కలుగుతూంది. నింగి అంచులు తాకే ఆ మంటలు క్షణ క్షణానికి దగ్గరవుతున్నాయి. శరీరం దహించుకు పోతూంది. గుండె లవిసి పోతున్నాయి.

ఆ భూతం తనను నిర్దాక్షిణ్యంగా మంటల్లోకి లాక్కుంటే? తను కాలి పోతుంది; బూడిదయిపోతుంది.

శారద కెవ్వున అరిచింది.

నారింజరంగు లైటు గదిఅంతా పరుచు కుంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. శారద కళ్ళు నులుముకొని, లేచి కూర్చుంది. ఆ అకారం లేదు. తనను భయపెట్టిన కల చెదిరిపోయింది. మేఘంలో భూతం ఎక్కడికో రివ్వున ఎగిరిపోయింది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటు న్నాయి. ధైర్యాన్ని కూడదీసుకుని, పక్కకు తిరిగి చూసింది. మూడేళ్ళ కృష్ణుడు ఒత్తిగిలి నిద్ర పోతున్నాడు. ఆ ముఖంలో ఎలాంటి భయం లేదు. భయం లేదన్నట్లు గట్టిగా తల్లిని పట్టుకున్నాడు.

పక్కమీది ప్రసాద్ కనిపించలేదు. సగం చదివి విడిచిన పుస్తకం తలగడమీద ఉంది. కాల్చి పారేసిన సిగరెట్లు నేలమీద చిందర వందరగా పడి ఉన్నాయి. ఏ విషయం గురించైనా తీవ్రంగా ఆలో చిస్తే తప్ప, అతను అన్ని సిగరెట్లు కాల్చడు. ఎందుకో తనకు తెలియదు గాని, ప్రసాద్ చాలా రోజులనుండి బాధ పడుతున్నాడు. రాత్రీ, పగలూ ఆలోచిస్తు న్నాడు. తనకు అందకుండా దూరం అయిపోతున్నాడు. ఒక్కోసారి చాలా చిత్రంగా ప్రవర్తిస్తున్నాడు.

అయిదేళ్ళ సంసారజీవితంలో వాళ్ళిద్దరి మధ్య ఎలాంటి కలతలు లేవు. చాలా సాఫీగా రోజులు గడిచిపోతున్నాయి. ఇద్దరూ ఉద్యోగస్థులే. ఒకరినొకరు గౌరవించుకున్నారు; ప్రేమించుకున్నారు; ఆరాధించుకున్నారు. జీవితంలో అనుకోని మలుపులో బండి చక్రాల్లో ఒకటి బురదలో కూరుకుపోయింది. ఊహించని సంఘటన ప్రసాద్ జీవితంలో తమాషాగా జరిగిపోయింది.

ఊళ్ళో ఉన్న ఒకానొక పెద్దమనిషి చిన్న ఉపకారం చేయమని ప్రసాద్‌ని అడిగాడు. పెద్ద మొత్తం ముట్టచెప్ప టానికి బేరం కుదుర్చుకోబోయాడు. కానీ, ప్రసాద్ దొంగ పర్మిట్ ఇవ్వ నన్నాడు. దొంగసొమ్ము తనకు వద్దన్నాడు. పై అధికార్లతో ఖరాఖండిగా చెప్పి, పెద్ద మనిషి మనసు నొప్పించాడు. పర్మిట్లు కంటె ముఖ్యమైనది తన పరువు పోయిం దని అతను హైదరాబాదు వెళ్ళి, నిమి షాల్లో ప్రసాద్‌ని ఉద్యోగం నుండి తీయించివేశాడు. డబ్బుంటే మనిషి ఏమైనా చేయగలడనే నిజం అప్పుడు కాని ప్రసాద్‌కి తెలియలేదు.

విషయం తెలుసుకుని శారద బాధ పడింది. ఈ రోజుల్లో మనిషి ఉన్నతంగా, ఆదర్శంగా బతకటం కష్టమే మరి. న్యాయంగా ప్రవర్తిస్తే, అందరిలో వేరసుడుగా మిగిలిపోవలసిందే! డబ్బు కున్న విలువ మనిషికి లేదు; మంచికీ లేదు.

తన ఉద్యోగం పోయినా ఆమె బాధ పడేది కాదు. ముందు ముందు తన సంపాదనతో ఇల్లు గడుస్తుందని అతను చిన్నబుచ్చుకుంటాడేమో నని బాధ పడింది. అతనిలో అలాంటి వృత్తాలు ఏర్పడకూడదని కోరుకుంది.

"బాధ పడకండి. మీరేలాంటి తప్పూ చేయలేదు. మరో చోట మీకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది." అనునయంగా మాట్లాడి, అతణ్ణి ఓదార్చ టానికి ఆమె ప్రయత్నించింది. నిజానికి ప్రసాద్ బాధపడలేదు. ఆప్యాయంగా ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసు కున్నాడు.

"శారదా! నేను బాధ పడను. మనిద్ద రిలో ఎవరు సంపాదించినా, నా కెలాంటి భేదం లేదు. నువ్వు సంపాదించినా, నేను సంపాదించినా మన జీవితాలు సాఫీగా సాగిపోతే చాలు." ప్రసాద్ మామూలుగానే అన్నాడు. ఆ మాటలకి శారద పొంగి పోయింది.

ఆరు నెలలు గడిచిపోయాయి.

ప్రసాద్ ఉద్యోగం పోయిందని గాని, ఏ పనీ లేకుండా ఇంట్లో కూర్చుని ఉంటున్నాడని గాని ఆమె మనసులోకూడా అనుకోలేదు. కానీ, అతనిలో ఏదో మార్పు వచ్చింది. ఆ మార్పు అతణ్ణి తన నుండి దూరం చేస్తూంది. ఏదో నైరాశ్యభావం అతనిలో చోటు చేసుకుని, తనకి చోటు లేకుండా చేస్తుంది. ప్రతి క్షణం అతను ఆలోచిస్తున్నట్లు, అవమాన పడ్డ తున్నట్లు కనిపిస్తున్నాడు. కేవలం ఉద్యోగం లేదని అతను ఆలోచిస్తున్నాడని గాని, అవమానపడుతున్నాడని గాని తను ఊహించలేదు. అతని బాధకి మరో కారణం ఉండాలి. అతన్ని ఆంతర్యాన్ని తను తెలుసుకోలేకపోతూంది.

ఈ జీవితాలు ఎప్పుడూ ఒకేలా ఎందుకు సాగవో అనుకుంది శారద. అప్రయత్నంగా ఆమె కళ్ళు చెమ్మ గిల్లాయి.


ఎర్రటి మంటలు, తెల్లటి పొగలు అస్ప ష్టంగా కనిపిస్తున్నాయి. కలలో కాదు, కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. పక్క గది తలుపులు సగం తెరిచి ఉన్నాయి. గదిలో వెలుగులో అస్పష్టంగా ప్రసాద్ నీడ కనిపిస్తూంది. అసంఖ్యాకమైన అను మానాలతో మనసు పీకుతూంటే గది వేపు పరుగు తీసింది శారద. కూడదీసుకున్న ధైర్యం జారిపోతూంది.

ఆ దృశ్యాన్ని చూసి, ఆమె ఆశ్చర్య పోయింది. బొమ్మలా చూస్తూ ద్వారం దగ్గర నిలబడిపోయింది.

నీలిమంటల నడుమ తన కిష్టమైన పట్టుచీర భగభగ మండిపోతూంది. తన ఆత్మాభిమానం మండిపోతూంది. ఏ తప్పూ చేయని తన హృదయం మండి పోతూంది. ప్రసాద్ ఉక్రోషంగా మంటల వేపు, కాలుతున్న పట్టుచీర వేపు చూస్తున్నాడు. కళ్ళలో పులుముకున ఎర్రటి చారలు వెలుగులో మరీ ఎర్రగా కనిపిస్తున్నాయి. ఆ కళ్ళలో కసి నిండి ఉంది. మనిషి నెత్తుర తాగాలనే దాహం దాగి ఉంది. అతని ఆవేదనకి కారణం తను. ఆ క్షణంలో కనిపిస్తే ప్రాణాలు తీసి, ఆ మంటల్లో పట్టుచీరలా తనను బూడిద చేస్తాడనిపిం చింది.

అవమానంతో నిస్సహాయంగా పక్క మీద వాలిపోయింది శారద. ధారాపాతంగా కారిపోతున్న కన్నీళ్ళు తుడుచుకుని గట్టిగా కళ్ళు మూసుకుంది.

ప్రసాద్ తనను తప్పించుకు తిరగ టానికి, అతను అనుభవిస్తున్న వ్యథకు కారణం తనే అనే విషయం ఇప్పటి వరకు శారదకు తెలియదు; ఊహించలేదు కూడా. ప్రసాద్ మనస్తత్వం తనకు బాగా తెలుసు. తను ఉద్యోగం చేస్తున్నం దుకు అతను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. తన గురించి అసహ్యంగా ఆలోచించే బలహీనతలు లేవు. కానీ, అతను అర్థాంతరంగా ఎందుకు మారిపోయాడో అర్థం కావడం లేదు. అతని దృష్టిలో తను చేసిన తప్పేమిటో? ఒకప్పుడు ప్రేమతో తన పుట్టిన రోజున ఇచ్చిన పట్టుచీరను కాల్చడంలో, అతని



శేషగిరికి తెలిసినంతవరకు ఆమె జీవితంలో జడివానలు, వడగాడ్పులు లేవే లేవు. శేషగిరి ఆమె కళ్ళు తుడిచి, ధైర్యం చెప్పటానికి ప్రయత్నించాడు.

"ఊరుకో, శారదా! . . . ఆడదంటే మగవాడికి అలుసు. ఇష్టం ఉన్నంత కాలం పుత్తడిబొమ్మలా చూసుకుంటాడు; పూజిస్తాడు. అతనిలో అసమర్థత ఏర్పడితే, ఏవో లేనిపోని ఆలోచనలు చేసి, అనుమానాలు పెంచుకుంటాడు. అతణ్ణి ఆరాధించే వ్యక్తినే అసహ్యంగా చూస్తాడు. ఇది మామూలే! భావగారు పనీపాటా లేకుండా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారుగా. నువ్వేదో చెడ్డ పని చేస్తున్నట్లు పిచ్చిగా ఆలోచిస్తున్నారేమో! లేకపోతే, నిప్పులాంటి నిన్ను అనుమానించటం దేనికి?"

ఆమెను సముదాయించటానికి అలా మాట్లాడాడు గాని, అతని మస్తిష్కంలో చాలా ఆలోచనలు పరుగులు తీశాయి.

శారద ప్రవర్తన ఎలాంటిదో శేషగిరికి బాగా తెలుసు. ఆమెతో చనువుగా ఉండవచ్చునేమోగాని ఎవరైనా హద్దు మీరితే బుద్ధి చెబుతుంది. అటువంటి అవకాశం తీసుకొనే 'గట్స్' ఎవరికీ లేవు. ఆమె చాలా ఖచ్చితంగా ఉంటుంది. అందుకే శేషగిరికి ఆమె మీద ప్రత్యేక వాత్సల్యం ఉంది. అసహజంగా ఆమెను ప్రసాద్ ఎందుకు అనుమానిస్తున్నాడో, అతను అనుకుంటున్న 'అతను' ఎవరో అతనికి అంతు పట్టలేదు.

ప్రసాద్ ఎక్స్చేంజ్‌కి ఎప్పుడూ రాలేదు. ఎవరితోనూ అతనికి పరిచయం లేదు. చిత్రం ఏమిటంటే, శేషగిరికి కూడా ప్రసాద్‌ను తెలియదు. అతను ఎవరో అనామకుడికో నిప్పు లాంటి శారద సంబంధం ఎందుకు కల్పించాడో అర్థం కాలేదు. ఏదో చేస్తున్న గారడీ మాయలో పడి, శారదను హింసించటం శేషగిరికి బాధగా తోచింది.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

"అతను కొన్ని మాటలు చాలా ప్రత్యేకంగా డైరీలో వ్రాసుకున్నాడు, బాబూ!... కిట్టని వాళ్ళెవరో నా మీద కట్టుకథలు చెప్పి ఉంటారు. అందుకే, మా ఇద్దరి మధ్య తెరలు పడిపోయాయి." శారద మోకాళ్ళ మీద తల పెట్టుకుంటూ అంది.

"నిజమే! ... నిజం బయటపడితే, తెరలు తొలగిపోతాయి, శారదా! ... ఇలాంటి కలతలూ, కన్నీళ్ళూ ఎన్నో రోజు లుండవు." ఆలోచన నుండి తేరుకుంటూ అన్నాడు శేషగిరి.

శారద కళ్ళలో కాంతి లేదు. పెద్దపులిని తప్పించుకోవటానికి అడవి అంతా పరుగులు తీసి, అలిసిపోయిన లేడిపిల్లలా బిక్కుబిక్కుమంటూ చూస్తోంది. కనుకొలకుల్లో నీరు చెంపల మీదుగా జారిపోతోంది. ఆ స్థితిలో ఆమెను ఇంటికి పంపించకూడదనిపించింది శేషగిరికి.

"శారదా! ... నాలుగు రోజులు మా ఇంట్లో ఉండకూడదూ? నీకు కొంత రిలీఫ్ దొరుకుతుంది." శేషగిరి ఆశగా అడిగాడు. అతనికి ఒక్క తల్లి తప్ప మరెవరూ లేరు.

"క్షమించు, బాబూ! నేను రాలేను ... ముసుగులో బాధ పడటం నా కిష్టం లేదు. చీకట్లు ముసురుకోక ముందే నా సంసారాన్ని చక్కదిద్దుకోవాలి. అతనికి భయపడి, నా మనశ్శాంతికోసం ఎక్కడో తలదాచుకుంటే, నాకు జీవితంలోనే మనశ్శాంతి కరవైపోతుంది." బ్రతుకైనా, చావైనా భర్త చేతుల్లోనే ఆమె కోరుకుంటోంది.

ఆమె స్తబ్ధుగా కూర్చోవటం శేషగిరి ఇష్టపడలేదు. ఆమెతో చాలా కబుర్లు చెప్పాడు. సలహా లిచ్చాడు. ధైర్యంగా ఉండమన్నాడు. ఆమెను నవ్వించటానికి చాలా జోకులు వేశాడు.

తన డ్యూటీ టైమ్ గడిచిపోయే వరకు శారద ఆఫీసు డార్మిటరీలోనే ఉండిపోయింది. చీకటి పడింది. దీపాలు వెలిగాయి.

శారద ఇంటికి బయలుదేరింది. తోడుగా ఇంటి వరకు వస్తానని ఆమెతో శేషగిరి కూడా వెళ్ళాడు.

వీథి చివరలో శారదను విడిచిపెట్టి, శేషగిరి తిరిగి వెళ్ళిపోయాడు. మరో సమయంలో అయితే అతణ్ణి ఇంటికి పిలిచి, ప్రసాద్‌కి పరిచయం చేసేది. కానీ, పరిస్థితుల్ని ఎదిరించే శక్తి లేక, మాటవరసకైనా అతణ్ణి రమ్మని పిలవలేదు.

ఇంట్లోకి అడుగు పెడుతున్న శారదను ప్రసాద్ నిలదీశాడు.

"వాడు మీ ఆఫీసులో పని చేస్తున్నాడు కదూ? ... "

ప్రసాద్ రౌద్రమూర్తిలా ఉన్నాడు. నీలి నీడలు అతని ముఖం మీద పడి, వింతగా కనిపిస్తున్నాయి. అతని అంతరంగ తరంగాల ఘోష ప్రస్ఫుటంగా వినిపిస్తోంది. ప్రసాద్ తనతో వచ్చిన శేషగిరిని చూశాడేమోగాని, అతని గురించి ప్రత్యేకంగా ఎందు కడుగుతున్నారో ఆలోచించటానికి ప్రయత్నించింది శారద. మళ్ళీ ప్రసాద్ అదే ప్రశ్న వేశాడు.

"అవునండీ ... నాకు తోడుగా వచ్చాడు." శారద మెల్లిగా జవాబిచ్చింది.

"నా నీడలో నీకు విసుగు పుట్టి, వాడి తోడు కోరుతున్నావు. వాడి తోడు లేకపోతే నువ్వు బతకలేవు ... అవునా? ... వాడంటే నీకు చచ్చేంత మోజు. వాడు క్షణం కనిపించకపోతే నువ్వు ఉండలేవు. వాడు కట్టుకోమన్న చీర కట్టుకుంటావు. వాడు పిలిచిన చోటుకి కాదనకుండా వెళ్ళగలవు. వాడడిగితే నన్ను విడిచిపెట్టి, వాడితో లేచిపోగలవు. వాడితో కొత్తగా కాపురం చేయడానికి సిద్ధంగా ఉన్నావు." ప్రసాద్ పిచ్చి ఆవేశంతో ఊగిపోతున్నాడు.


ప్రసాద్ అనుమానిస్తున్న 'అతను' శేషగిరి అని తెలుసుకుని శారద తెల్లబోయింది. వెన్నెల్లాంటి తెల్లని స్నేహంలో ఎవరో నల్లని సెగలు పుట్టించారు. జీవితంలో జ్ఞాపకాల పుటల్లో దాచుకొనే పరిచయాలకి పేలవంగా రంగులు పూసి, అక్రమ సంబంధం జత చేశారు. ఆడదాని బ్రతుకులో నిప్పులు రువ్వి, నవ్వుకొని ఆనందించే మనుషులున్నంతకాలం 'అరిటాకుమీద ముల్లు' సామెత మారదు మరి. ఈ వ్యవస్థలో స్త్రీకి విలువ పెరగదు.

"అబద్ధం ... అబద్ధం. మీరు పొరపడుతున్నారు. శేషగిరికీ, నాకూ అలాంటి నీచమైన సంబంధం లేదు." పిచ్చిగా, బిగ్గరగా శారద అరిచింది.

"నువ్వు గట్టిగా అరిచినంతమాత్రాన అది అబద్ధం కాదు. పచ్చి నిజం. ఆ నిజం తెలుసుకున్నప్పటినించి నేను మానసికంగా బాధపడుతున్నాను. ఆఫీసులో మీ ఇద్దరి ప్రేమాయణాన్ని ఊహించి, ఊహించి జీవచ్ఛవాన్ని అయిపోయాను."

"నా మాట నమ్మండి. శేషగిరి నాకు తమ్ముడు లాంటి వాడు. కాదు... కాదు... తమ్ముడే ..."

"అవినీతిగా ప్రవర్తించే నీలాంటి వాళ్ళు పవిత్రమైన ఆ బంధాన్ని రక



ఉండడు. తన ఇల్లాలికి పరాయి వాడితో అక్రమ సంబంధం ఉందని తెలిస్తే ఏ మగవాడూ సహించడు. మనిషిలో అనుమానం రాకూడదు. వస్తే, అది అంతై, ఇంతై భూతంలా చోటు చేసుకుంటుంది. రంగుటద్దాల్లో దాగిన ఆ మనసుకి 'నిజం' తెలియదు. అబద్ధమే కనిపిస్తుంది. ఆ మనిషిని పుట్టించిన దేవుడే దిగివచ్చి చెప్పినా అతనిలో అనుమానం నివృత్తి కాదు.

పెనుగాలికి పిచ్చిగా ఊగిపోతున్న పెద్ద చెట్టులా ఉంది శారద పరిస్థితి.

తను తప్పు చేయలేదు. నిజం దేవుడికి తెలుసు. ఆ దేవుడే ప్రసాద్‌కి నిజం తెలుసుకొనే శక్తిని ప్రసాదించాలి. అతనిలో అనుమానం తెరలు తొలగిపోయి, తనకు చోటు దొరకాలి. తన జీవితంలో మళ్ళీ కొత్త వెలుగులు రావాలి.

• • • •

ప్రసాద్ హాయిగా, ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అతణ్ణి చూడగానే శారద మనసు తరుక్కుపోయింది. కొన్ని క్షణాలు అతని వేపు జాలిగా చూస్తూ ఉండిపోయింది. అతను తనకోసం రాత్రీ, పగలూ ఆలోచించి అలిసిపోయాడు. ఆ క్షణంలో అతనితో నిజం చెప్పి, అతని గుండె మీద వాలిపోవా లనిపించింది. ఎప్పుడూ అతణ్ణి మోసం చేయలేదని, తన గుండెల్లో అతనికి తప్ప మరెవరికీ చోటు లేదని—ఇంకా ఏవేవో ఆవేశంగా అతనితో చెప్పాలనిపించింది.

ఇల్లంతా బోసిగా కనిపించింది. ప్రసాద్ లేచేసరికి ఇల్లంతా చక్కబెట్టి అద్దంలా ఉంచాలనీ, అద్దం లాంటి అతని మనసు మీద ఏర్పడిన మచ్చను చెరిపివేయాలనీ శారద అనుకుంది. బరువెక్కిన హృదయం దూదిపింజలా తేలిక పడింది.

నల్లమబ్బు వేసి, చీకటి కమ్మింది. హోరున గాలి వీస్తోంది. చిటపట చినుకులు పడుతున్నాయి.

గదిలో చీకటిగా ఉంది.

శారద లైటు వేసింది.

టేబిలుమీద పేపరు వెయిటరు కింద రెపరెప లాడుతున్న ఉత్తరాన్ని శారద చూసింది. ఉత్తరంలోని అక్షరాలు వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఏదో బలహీనత ఆమెను క్రుంగదీస్తోంది. ఆత్రతగా ప్రసాద్ వేపు తిరిగింది. అతను చలనరహితంగా కనిపిస్తున్నాడు.

వణుకుతున్న చేతుల్లోకి శారద ఉత్తరం తీసుకుంది. ఆమెలో ఎన్నో సంశయాలు సుడులు తిరుగుతున్నాయి.

"శారదా!

భార్యాభర్తల్లో ప్రేమానురాగాలే కాదు, పవిత్రత కూడా ఉండాలి. ప్రతి మగవాడు తన భార్య పవిత్రంగా ఉండాలనీ, ఆమె తనను మోసగించకూడదనీ కోరుకుంటాడు. ప్రతి స్త్రీ తన భర్త హృదయంలో మరో ఆడదానికి చోటు ఉండకూడదనీ, అతని తోడు తనకు జీవితాంతం కావాలనీ ఆశపడుతుంది. ఇది నా అభిప్రాయం.

ఆ అభిప్రాయం నా విషయంలో ఎదురు తిరిగింది. నువ్వు శేషగిరితో సంబంధం పెట్టుకున్నావు. నన్ను మోసం చేశావు. ఆ నిజం తెలుసుకున్న తరవాత నిన్ను ఎలా ప్రేమించగలను? నీ హృదయంలో నాకు స్థానం లేదనిపించింది. ఆ రోజు నుండి ఎవరితో చెప్పుకోలేక, మనసులో దాచుకోలేక, నిన్ను అడగలేక అనుక్షణం మానసికంగా 'పాపం' అనుభవిస్తున్నాను. శేషగిరిలో నువ్వెంతగా కలిసిపోయావో, అతనంటే నీ కెంత ఇష్టమో తెలుసు. ఏదో రోజున నువ్వు అతనితో లేచిపోతావు. లేచిపోయిన దాని మొగుడిగా, వెర్రి వెధవలా నేను మిగిలిపోతాను. అందరిలో చులకనైపోతాను. నేను చాలా సెన్సిటివ్. అటువంటి దౌర్భాగ్యాన్ని కోరుకోలేను. అందుకే — నీ నుంచీ, నీ జీవితంనుంచీ నేను తప్పుకుంటున్నాను.

పిరికివాడిలా ఆత్మహత్య చేసుకున్నానని, అసమర్థుడిలా జీవితం నాశనం చేసుకున్నానని నువ్వు నవ్వవచ్చు. కానీ, నలుగురిలో నవ్వులపాలు అయేదానికంటే ఇలా చావడం నయమనిపించింది. ఇక నీ స్వేచ్ఛకు అడ్డు ఉండదు. నీకు ఉద్యోగం ఉంది. బతకగలవు. ఏ పని చేసినా నువ్వు అందరిలో నెగ్గుకు రాగలవు.

—ప్రసాద్."

చేతిలో ఉత్తరం గాలికి రివ్వున ఎగిరిపోయి, వానచినుకుల్లో తడుస్తూంటే, శారద పిచ్చిదానిలా చూస్తూ ఉండిపోయింది. ★

## చరిత్రకందని అమరవీరులు

# బ్రహ్మబంధు ఉపాధ్యాయ

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎందరో దేశభక్తులు, వీరులు తమ తమ శక్తినిబట్టి పోరాడారు. కొందరు బ్రిటిష్ ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ వారిని ఎదిరించారు. కొందరు సైన్యాన్ని తయారు చేసి బ్రిటిష్ సైన్యంతో పోరాటం సలిపారు. ఎదురొడ్డి నిలిచి బలి అయిపోయారు.

మరికొందరు తమ మేధస్సుతో ఉద్యమాన్ని లేవదీశారు. లేచిన ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. జాతిని చైతన్యవంతం చేశారు. ఇలా సాహిత్యరంగంలో కృషి చేస్తూ జాతినంతటినీ ప్రభావితం చేసి బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించేలా చైతన్యవంతం చేసిన మేధావులలో బ్రహ్మబంధు ఉపాధ్యాయ ఒకడు.

ఇతడు 1861 ఫిబ్రవరి 11 వ కలకత్తాకు సమీపంలో ఉన్న గ్రామం ఖన్నన్‌లో జన్మించాడు. తండ్రి దేవీ చరణ్ బంధోపాధ్యాయ.

బ్రహ్మబంధు సంస్కృతం, హిందీ, పారసీ, ఇంగ్లీషు భాషల్లో మంచి పాండిత్యాన్ని సంపాదించాడు.

ఇతడు 1888 నుంచి 1898 వరకు సింధు లోని హైదరాబాదులో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. తరవాత అతని దృష్టి సాహిత్యరంగంవైపు మళ్ళింది. ఆ నాటి బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులపై కొనసాగిస్తున్న అమానుషాలను, కసాయి పరిపాలనా విధానాలను చూసి ఆయన తల్లడిల్లి పోయాడు.

**ఎ. పండరినాథ్**

ప్రజల్లో చైతన్యం కలగనిదే జాతి అంతా ఏకం కాదనుకున్నాడు. 'కాంకర్డ్' అనే మాస పత్రికను నడపసాగాడు.

ఇటు సాహిత్యరంగంలో కృషి చేస్తూనే సాంఘిక సేవా కార్యకలాపాల్లో పాల్గొనసాగాడు. 1897 లో సింధు ప్రాంతంలో ప్లేగు వ్యాపించి భీకర పరిస్థితి ఏర్పడ్డప్పుడు ఎంతో సేవ చేశాడు. బాధితులను ఆదుకున్నాడు. రవీంద్రనాథ్ ఠాకూర్‌తో కలిసి కొంతకాలం శాంతి నికేతన్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు.

ఆ తరవాత 1901 లో భారతీయ వేదాంతాన్ని, భారతీయ సంస్కృతిని గూర్చి ఉపన్యసించడానికి గ్రేట్ బ్రిటన్ వెళ్ళాడు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల్లో ఉపన్యాసా లిచ్చి, 1904 లో భారతదేశానికి తిరిగి వచ్చాడు.

భారత దేశానికి తిరిగి రాగానే ఇక్కడి పరిస్థితులు అతణ్ణి కలచివేశాయి. భారతీయులపై బ్రిటిష్ అధికారులు జరుపుతున్న దురాగతాల్నీ ఉన్నదున్నట్లుగా చిత్రించి భారతీయుల కండ్లు తెరిపించాలని అతడు 'సంధ్య' అనే దినపత్రికను ప్రారంభించాడు. ఆ నాడు ప్రతి భారతీయుడూ ఈ పత్రికను ఎంతో ఆత్రతతో చదివేవాడు.

'సంధ్య' పత్రికను నడుపుతూనే ఆయన స్వదేశ ఉద్యమాల్లో పాల్గొనసాగాడు. బెంగాల్‌ను విభజించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు; విమర్శించాడు. 1907 లో ఆయన 'స్వరాజ్' అనే జాతీయ వారపత్రికను ప్రారంభించాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఉన్నదున్నట్లు ప్రతిబింబింప జేసింది ఆ నాడు 'స్వరాజ్' వారపత్రిక.

బ్రహ్మబంధు అంటేనే బ్రిటిష్ అధికారులు భయపడసాగారు. ఇక అతణ్ణి లొంగదీయనిదే లాభం లేదన్నారు. 'సంధ్య' పత్రిక కార్యాలయాన్ని సోదా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నందుకు 1907 సెప్టెంబర్ 3 వ తేదీన జైలులో పెట్టారు.

అతణ్ణి బంధించి కోర్టుకు హాజరు పరచినప్పుడు అత డిలా అన్నాడు: "నేను చివరి శ్వాస వీడేవరకూ మీ కుతంత్రాల్నీ, మీ అరాచకాన్నీ ఇలాగే బట్టబయలు చేస్తూ ఉంటాను. మా దేశాన్ని పరిపాలించడానికి మీ కెలాంటి హక్కూ లేదు."

అతణ్ణి మాటి మాటికీ బంధించడం, కోర్టులో హాజరుపరచడం, జైల్లో పెట్టడం పనిగా పెట్టుకుంది బ్రిటిష్ ప్రభుత్వం. దీన్ని భరించలేకపోయాడు ఉపాధ్యాయ. అతను మానసికంగా, శారీరకంగా జబ్బు పడ్డాడు. చివరికి లేవలేకుండా పడిపోయాడు. దేశానికి నే నేమీ చెయ్యలేకపోతున్నాననే ఆవేదన అతణ్ణి మరీ క్రుంగదీసింది.

అతనికి జబ్బు ముదరగా హాస్పిటల్లో చేర్చి ఆపరేషన్ చేశారు. అయినా, అతడు బ్రతకలేదు. 1907 అక్టోబర్ 27 న శాశ్వతంగా కన్ను మూశాడు. ★

### పవిత్రత

ప్రేమ, వివేకం, సౌందర్యం - వీటికి అవధులు లేవు . . . అయితే, వాటిని పవిత్రంగా ఆరాధించాలి.

—ఎమర్సన్